మధురాంతకం నరేంద్ర

# మలుపు




హాలంతా నిశ్శబ్దంగా వుంది.

అత్యుత్తమ చిత్రంగా అనేక బహుమతులను గెలుచుకున్న చిత్రం అది.

తమ సభ్యులకోసం ఆ పట్టణానికి చెందిన ఫిలిం సొసైటీవాళ్లు దాన్ని ప్రత్యేకంగా తెప్పించారు.

నిజ జీవితంలో ఎవరూ పట్టించుకోలేనంతటి చిన్నవిషయాలలో సయితం మగవాళ్ళచేత ఆడవాళ్లెలా మోసగింపబడుతున్నారో చాలా నైపుణ్యంతో చిత్రీకరించారు ఆ దర్శకుడు.

ప్రేక్షకులందరూ బయట ప్రపంచాన్ని మరచిపోయి సినిమాలో నిమగ్నమై పోయి వున్నారు.

తనను పట్టించుకునే వాళ్లెవరూ లేనందుకు నిరసన తెలియచేస్తున్నట్టుగా ఝాన్సీ ఒడిలోని పాపకెవ్వుమంటూ ఆరున్నొక్కరాగం అందుకొంది.

ఝాన్సీ వులిక్కిపడింది.

“నీకేమయిందే తల్లీ! ఊరుకో. ..ఊరుకో” అంటూ సముదాయించడానికి ప్రయత్నించింది.

తమ ఏకాగ్రతకు భంగం కలిగించిన పాపవేపు, ఆపాప తల్లివేపు చాలమంది విసుగ్గా చూస్తున్నారు.

ఝాన్సీకేం చెయ్యాలో తోచలేదు.

పాప ఏడుపు మానడంలేదు.

“ఝాన్సీ! పాపను కాస్సేపు బయటకుతీసుకెళ్ళు” అన్నాడు ఆమె భర్త హరి.

అంతవరకూ ఆ ఆలోచనరానందుకు తనను తానే తిట్టుకుంటూ పైకి లేచింది ఝాన్సీ.

డోర్ దగ్గరవున్న నల్లటి తెరను తొలగించింది.

శక్తినంతా వుపయోగించి గొళ్ళెంతీసి బయటకి నడచింది. ఇక నువ్వు లోపలికి రానవసరం లేదన్నట్టుగా తలుపు తనంతట తానే మూసుకుపోయింది.

చీకటిలోనుంచీ వున్నట్టుండి వెలుతురులోకి వచ్చినందువల్ల ఆమెకు కాసేపు ప్రపంచమంతా అలుక్కుపోయినట్టుగా కనిపించింది.

బయట అంతా దాదాపు నిర్మానుష్యంగా వుంది.

సినిమాహాలు కాంపౌండు గోడకు వివిధ సినిమాల పోస్టర్లున్న బోర్డులు అనించబడి వున్నాయి.

టీ అంగడిలో దాదాపు ఇరవయ్యేళ్ళ వయసున్న యువకుడు బాయిలరుముందు నిలబడి తన తంటాలు తాను పడుతున్నాడు. బంకులోని నడివయసతను సీసాలను సర్దుకుంటు

న్నాడు.

"ఊరుకో బేబీ! ఊరుకో!...." అంటూ జిజ్జిగొట్టసాగింది ఝాన్సీ.

సినిమా పోస్టర్ల దగ్గరకు తీసుకెళ్ళి బొమ్మలను చూపెట్టింది. అటు వైపుకూ, యిటు వైపుకూ తిరగసాగింది. పాప ఏడుపాపలేదు.

ఇంతలో ఆమె చూపులు టీ కొట్టుపైన పడ్డాయి. పాపకు ఆకలయ్యి వుంటుందన్న సంగతి ఆమెకు స్ఫురించింది.

పాపకు నాలుగు నెలలు దాటినప్పటినుంచీ బుడ్డీపాలే శరణ్యమయ్యాయి. అందుకే ఎక్కడికి బయల్దేరినా పాపతో బాటుగా పాల బుడ్డీ గూడా తీసుకెడుతూ వుండేది ఝాన్సీ. కానీ ఈరోజు తొందర తొందరగా బయలుదేరి రావలసి వుండడంవల్ల పాలబుడ్డి సంగతి మరచి పోయింది. టీ అంగడి దగ్గరకు వెళ్ళి పాలు తీసి తాగించదలచుకొంది ఆమె. వెంటనే తన దగ్గర డబ్బులు లేవన్న సంగతి గుర్తుకొచ్చింది. డబ్బులు కావాలంటే లోపలికి వెళ్ళి భర్తను అడగాల్సిందే!

"ఛీ....ఛీ....పాడు ఆడజన్మ!" అనుకొంది ఝాన్సీ.

"పాపకు పాలు తాగించగూడదాండీ!!"

ఉలిక్కిపడి చూచింది ఆమె.

టీ అంగడి అబ్బాయి అడుగుతూవున్నాడు. అతడు తనను ఎంత సేపటినుంచీ గమనిస్తున్నాడో-ఏమో!

"మరి....మరి....డబ్బులు....పర్సు హాలు లోపలే వుంది."


"ఇంటర్వెల్లో తెచ్చివ్వండి ... పర్వాలేదు" అంటూ ఆ అబ్బాయి పాల గ్లాసు యిచ్చాడు.

"మరో గ్లాసు కావాలి... పాప వేడిపాలు తాగలేదు....."

ఆ అబ్బాయి మరో గ్లాసు అందించాడు.

పాప నక్కడే కూర్చోబెట్టి మెల్లమెల్లగా పాలు తాగించింది ఝాన్సీ.

"థాంక్సండీ..........ఇంటర్వెల్లో డబ్బులిస్తాను...." అంటూ పాపనెత్తుకొని వెనుదిరిగింది.



తలుపుతీసి, కర్టెను తొలగించుకొని లోపలికి వచ్చింది. తలుపు తనంతట తానుగా మూసుకొంది.

లోపలికి ప్రవేశిస్తూనే ఆమె కళ్ళు తెరపైకి మళ్ళాయి. జరుగుతున్న సంఘటన ఏమిటో అర్థంగాలేదు. తన సీటుకోసం వెతకసాగింది ఝాన్సీ. రెండు మూడు నిముషాల ప్రయత్నం తరువాతగానీ సీటు కనిపించలేదు. వెళ్ళి కూర్చొంది. ఏకాగ్రతతో సినిమానే చూస్తూ వున్న భర్త హరి ఆమె రాకను గమనించనేలేదు.

తెరపైని సంఘటన ఎంత ప్రయత్నించినా అర్థంగాక పోవడంతో "ఏం జరిగిదండీ?" అంటూ ప్రశ్నించింది ఝాన్సీ.

"ముందు సినిమా చూడు. ఇంటికెళ్ళిం తరువాత చెబుతాను" విసుక్కుంటున్నట్టుగా గొణిగేసి సినిమాను తదేకంగా చూడసాగాడు హరి.

ఆమె ముఖం చిన్న బుచ్చుకొంది.

సినిమాలో నాయకుడు నాయిక నెందుకో చావబాదుతున్నాడు.

భర్తకేసి చూసింది ఝాన్సీ.

కుర్చీలో హాయిగా కూర్చుని, కాళ్ళు బాగా చాచుకొని, శరీరాన్నే మరచిపోయి సినిమా చూస్తున్నాడు.

బిడ్డలపైన తల్లికెంత బాధ్యతవుందో, తండ్రికీ అంతే బాధ్యతవుంటుంది. తాను అతనిలా ఫ్రీగా కూర్చోలేకపోతున్నందుకు కారణం ఒడిలోని పాప.

పడుకున్న పాపను అలాగే ఎత్తి అతడి ఒడిలో పడుకోబెడుతూ "కాస్సేపు పాపనెత్తుకోండి" అంది ఝాన్సీ ఆజ్ఞాపిస్తున్నట్టుగా.

అతడు భార్యకేసి ఓసారి తీక్షణంగా చూసి నీ సంగతి యిప్పుడు కాదులే అన్నట్టుగా పాపను పదిలంగా పట్టుకొని సినిమా చూడసాగాడు.

ఝాన్సీ కాళ్ళుబాగా చాచుకొని, చీర కుచ్చిళ్ళు సర్దుకొని, వ్రేళ్ళు ఓసారి విరుచుకొని పడుకొన్నట్టుగా కూర్చొంది.

ఒకటి... ..రెండు........నిముషాలు గడవసాగాయి.

పదిహేను నిముషాలు గడచాయి.

ఝాన్సీ సినిమాను అర్థం చేసుకోగలిగింది, కాబట్టి మళ్ళీ అందులో లీనమైపోయింది.

కానీ ఆ ఏకాగ్రతకు మళ్ళీ భంగం కలగక తప్పిందిగాదు.

పాప మళ్ళీ ఏడుపు మొదలెట్టింది.

హరికి గొంతుకవరకూ కోపం వచ్చింది. కానీ దాన్ని బయటపెట్టడానికి అది అనువైన చోటు కాదనుకున్నాడేమో—పాపను విసుగ్గా ఝాన్సీ చేతి కందిస్తూ "పాపను అప్పుడే ఎందుకు తీసుకొచ్చావు లోపలికి? నిద్రపోయిం తరువాత తీసుకొస్తే ఏం పోయింది? తీసుకెళ్ళు" అన్నాడు.

పొరబాటంతా తనదే అయినట్టుగా మాట్లాడుతున్న భర్త వైఖరిని చూడగానే ఝాన్సీకి చెప్పలేనంత కోపం వచ్చింది.

పాపనందుకొని సుడిగాలిలా పైకిలేచి బయటకు వచ్చేసింది.

పాపను భుజంపైన పడుకోబెట్టుకొని చేతితో వీపుపైన తట్టుతూ సముదాయించసాగింది. దాన్ని అలా సినిమాకు తీసుక రావడం మొదటి సారేంగాదు. ఇంతకు ముందు తాను నాలుగైదు సార్లు తీసుకొచ్చింది. కాని అప్పుడెప్పుడూ యిలా చేయలేదు. లేదంటే యింటర్వెల్లో పాలు తాగించేది. ఇప్పుడు గూడా ముక్కులదాకా తాగిందిగదా పాలు! మరెందుకిలా ఏడుస్తోంది!

తనను సినిమా చూడనివ్వకుండా చేయాలనే ఏడుస్తోందేమోననిపించగానే కోపంతో ఓసారి వేగంగా తట్టింది ఝాన్సీ. పాప రాగం శృతిమించి పోయింది.

తనకేసే చూస్తున్న టీ అంగడి అబ్బాయి కనిపించాడు. తన తొందరలో డబ్బులు తీసుక రావడం ఈసారి గూడా మరచిపోయింది. అంగడికి దగ్గరగా నడచి "ఈసారి గూడా మరచిపోయాను. ఇంటర్వెల్లో తెచ్చిస్తాను'' అంది.

అతను తలవూపాడు.

ఇంటి దగ్గర పాప యిలా గుక్క తిప్పుకోకుండా ఏడ్చినప్పుడు—భుజంపైన వేసుకొని గదిలో పచార్లు చేయడం ఝాన్సీకి అలవాటు. అలాచేస్తే పాప వెంటనే నిద్రపోతుంది. కానీ సినిమా టాకీసులో పచార్లు చేయడం ఏంబావుంటుంది? అయినా తప్పనిసరి గావడంతో ఎవరూ చూడని చోటికి నడచి పచార్లు చేయసాగింది.

"ఇంటి దగ్గర హరి ఆదర్శాలు వల్లిస్తూంటే తానెంత మురిసిపోయేది! అంతా నిజమే నను కొని ఆనందపడేది! కానీ అవసరంవచ్చినపుడు తెలుస్తోంది అసలు కథ. లేకపోతే పాప మాటిమాటికీ ఏడుస్తోంటే—ఒక్కసారయినా ఓదార్చగూడదూ? మాటిమాటికీ పో, పో— అంటూ తనను బయటికి పొమ్మనడమేనా? ఇకమీదట ఇలాగాదు—అనుకొంది ఝాన్సీ.

పాప నిద్రపోయింది.

లోపలికి వెడదామనుకొంది ఝాన్సీ. కానీ మళ్ళీ లేస్తుందేమోనన్న ఆలోచన రాగానే ఆగిపోయింది.

ఇంటర్వెల్ వదలినట్టున్నారు-

తలుపులు తెరుచుకున్నాయి.

పుట్టలోనుంచి బయటికివచ్చే చీమల మల్లే

బయటి కొస్తున్నారు అందరూ.

తనవైపుకే గబగబా నడచివస్తున్నాడు హరి.

ఆమె ముఖం ముడుచుకొంది.

"పాప నిద్రపోయిందా?" అంటూ పలకరించాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

"కాఫీ తీసుకరానా?" అన్నాడు.

"నా ముఖానికి కాఫీ ఒకటే తక్కువయ్యింది! టీ బంకులో పాపకు పాలు తాగించాను. వాడికి డబ్బులిచ్చి రండి." అంటూ అతడి ముఖంకేసి చూడకుండానే విసురుగా లోపలికివచ్చి కూర్చొంది ఝాన్సీ.

లోపలికి వచ్చే వాళ్ళతోనూ, బయటికివెళ్ళే వాళ్ళతోనూ హాలంతా సంతలావుంది. ఝాన్సీ మనస్సుగూడా చీకాకుగా వుంది.

"పాడు సినిమా. వచ్చి గూడా లాభం లేకపోయింది. తన ప్రాణానికి ఈ బిడ్డొకటి దొరికింది. ఒక సుఖమూలేదూ, ఏమీలేదు. ఈసారి ఏడిస్తే వెళ్ళనుగాక వెళ్ళగూడదు. వెళ్ళకుండా ఏం చెయ్యాలి? ఆయనగారి దగ్గిరికిచ్చి తీసుకెళ్ళమనాలి. తీసుకెళ్ళను పొమ్మంటే ....తానూ పోగూడదు. మొండిగా కూర్చుని వుండాలి....పొమ్మని గద్దించి మాట్లాడితే.... ఏమైనా కానీ లెమ్మని వులక్కుండా పలక్కుండా వుండిపోవాలి. సినిమాలో కొట్టబోతే....హూ. ..తనకు మాత్రం ఆత్మాభిమానం లేదూ? లేచి గిరుక్కున వెళ్ళిపోవాలి. ఎక్కడికి వెళ్ళాలి? యింటికి....అవును.... యింటికి వెళ్ళిపోవాలి....చూడాలి....చూడాలి- ఈ మగవాళ్ళ కథేమిటో....తేల్చుకోవాలి...."

తెరమీదస్లయిడ్లు వేయడం మొదలుపెట్టారు.

బేక్‌గ్రౌండ్ మ్యూజిక్ మనుషుల్ని వూపుతోంది. హరి వచ్చి కూర్చున్నాడు.

"చాక్‌లెట్" అంటూ గుప్పిట విప్పి చూపాడు.

"అక్కర్లేదు" అంది ఖచ్చితంగా.

హరి మౌనంగా ఒక చాక్‌లెట్ కవరువిప్పి నోట్లో వేసుకున్నాడు.




ఇంకా మనుషులు మెల్లమెల్లగా లోపలికి వస్తూనే వున్నారు.

ఒకలావయిన వ్యక్తి....రెండు వరసలకు మధ్య వస్తోంది. ఆవిడ వెళ్ళడానికి- స్థల మివ్వడం కోసం కాళ్ల దగ్గరకు జరుపుకొంది ఝాన్సీ. అయినా ఆవిడకా స్థలం చాలలేదు. మనిషిని వెనక్కి నెడుతున్నట్టుగా ముందు కెళ్ళింది. హరిగూడా జాగ్రత్తపడ్డాడు. ఆ రాపిడికి పాప మళ్ళీ లేచి కూర్చొంది.

ఎక్కడో తగిలినట్లుంది. బేక్‌గ్రౌండు మ్యూజిక్కుకంటే శ్రావ్యంగా ఆలాపించ సాగింది పాప.

ఝాన్సీకి చెప్పలేనంత విసుగొచ్చింది.

'తాను అతడికిచ్చి బయటకు తీసుక పొమ్మ నాలి. వెళ్ళకుండా తననే తీసుకపొమ్మంటే- అతనిమాట వినగూడదు. బాగా బుద్ధి చెప్పాలి. తనను దురుసుగా ఏమయినా అంటే తానువెళ్ళి పోవాలి' అనుకుంటూ విసురుగా పాప నతడి ఒడిలోపెట్టి "బయటకు తీసుకెళ్ళండి" అంది.

ఆశ్చర్యం!

హరి పైకి లేచాడు.

ఝాన్సీ నిశ్చేష్టురాలై చూస్తూ వుండగా అతడు బయటికి నడిచాడు.

స్లయిడ్లు వేయడం పూర్తయినట్లుంది— సినిమా మళ్ళీ ప్రారంభమయ్యింది.

నిముషాలు గడుస్తున్నాయి.

తెరపైన ఏం జరుగుతూందో తెలుసుకోవా లన్న ధ్యాస ఆమెకు కలగలేదు.

అయిదు నిముషాలు గడచాయి.

హరి లోపలికి రాలేదు.

పదిహేనునిముషాలుగడచాయి. హరిరాలేదు.

తాను అనుకొన్న రీతిలో గాక, మరో విధంగా ఎదురైన పరిస్థితి ఆమెను విస్మ యంలో ముంచి వేసింది.

ఇక మౌనంగా వుండలేకపోయింది ఝాన్సీ.

పైకి లేచి బయటకు నడచింది.

టీ కొట్టుబయట ఒక స్టూలు....ఆ స్టూలు పైన హరి....అతడి చేతుల్లో ఏడుస్తున్న పాప ....చేతిలోని కప్పును పాపనోటి దగ్గరగా పెడుతూ "తాగమ్మా! తాగు...." అంటూ అనునయిస్తున్నాడు అతను.

పాప వినడంలేదు.

చేత్తో కప్పును దూరంగా తోయడానికి ప్రయత్నిస్తోంది.

దూరంగా అలాగే రెండు మూడు నిముషాల సేపు నిలబడి చూస్తూవుండిపోయింది ఝాన్సీ.

హరితాగించడానికి ప్రయత్నిస్తూనేవున్నాడు.

పాప తాగడంలేదు.

గబగబా అతడి దగ్గరకు నడచి "మీరువెళ్లి సినిమా చూడండి....నేను పాపను సముదా యిస్తాను" అంటూ అతడు విస్తుపోయి చూస్తూ వుండగా పాపను దగ్గరికి తీసుకొందిఝాన్సీ. □

